సమస్యలుంటే సాక్షికి చెప్పండి

మీ సమస్యలు, ప్రయోజనకర సూచనలు, ఇతర అంశాలను కింద ఫోన్ నంబర్‌కు వాట్సాప్ చేయండి

78932 44734

నంబర్‌ను సంప్రదించండి

క్లుప్తంగా

మండపాల నిర్వాహకులు నిబంధనలు పాటించాలి



మండపాల నిర్వాహకులతో మాట్లాడుతున్న సీఐ చక్రధర్

గోపాలపట్నం: దసరా సందర్భంగా దుర్గాదేవి మండపాలు ఏర్పాటు చేసిన నిర్వాహకులు నిబంధనలు పాటించాలని ఎయిర్‌పోర్టు సీఐ చక్రధర్ సూచించారు. ఎయిర్‌పోర్టు పోలీస్ స్టేషన్‌లో మండప నిర్వాహకులతో శుక్రవారం నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. మండపాల వద్ద అపశృతులు చోటు చేసుకోకుండా జాగ్రత్తలు పాటించాలన్నారు. డీజే సౌండ్లు నిషేధమని తెలిపారు. ట్రాఫిక్ సమస్య తలెత్తకుండా చూసుకోవలసిన బాధ్యత నిర్వాహకులదే అన్నారు. అవసరమైన చోట సీసీ కెమెరాలు ఏర్పాటు చేసుకోవాలని, రాత్రి సమయాల్లో కమిటీ సభ్యుల్లో కనీసం ఒకరైనా మండపం వద్ద ఉండాలని తెలిపారు. ఏ ఘటనలు జరిగినా నిర్వాహకులదే బాధ్యత అని స్పష్టం చేశారు. కార్యక్రమంలో ఎయిర్‌పోర్ట్ పోలీస్‌స్టేషన్ పరిధిలోని మండపాల నిర్వాహకులు పాల్గొన్నారు.

రైల్వే ట్రాక్ వద్ద వృద్ధురాలి మృతి



ఆదిలక్ష్మి (ఫైల్)

గోపాలపట్నం: ఎన్ఏడీ జంక్షన్ సమీపంలో రైల్వే ట్రాక్ వద్ద ఓ వృద్ధురాలు మృతి చెందారు. ఆర్పీఎఫ్, జీఆర్పీ సిబ్బంది ఇచ్చిన వివరాలివి.. జీవీఎంసీ 52వ వార్డు గురజాడ నగర్‌కు చెందిన బోర ఆదిలక్ష్మి (62)శుక్రవారం ఉదయం 11.30 గంటల రైల్వే ట్రాక్ వద్ద అపస్మారక స్థితిలో కనిపించారు. స్థానికులు గమనించి, ఆర్పీఎఫ్‌కు సమాచారం అందించారు. ఆర్పీఎఫ్ కానిస్టేబుల్ వెళ్లే సరికే ఆమె మరణించారు. ఆర్పీఎఫ్ పోలీసులు జీఆర్పీకి సమాచారం అందించడంతో హెచ్‌సీ వైకుంఠరావు, కానిస్టేబుల్ గణేష్ ఘటనా స్థలానికి వెళ్లి ఆధారాలు సేకరించారు. రైలు పక్కనుంచి వెళ్తున్నప్పుడు ఆ శబ్దానికి ట్రాక్‌పక్కకు పడడంతో, వృద్ధురాలి తలకు గాయమై మృతి చెంది ఉంటుందని భావిస్తున్నారు. మృతదేహాన్ని కేజీహెచ్‌కు తరలించారు. మృతురాలికి భర్త బోరగణేష్, ఇద్దరు ఆడపిల్లలు ఉన్నారు. మృతురాలి భర్త ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.

స్టీల్‌ప్లాంట్ ప్రైవేటీకరణ నిలిపివేయాలి

సీతమ్మధార(విశాఖ ఉత్తర): స్టీల్‌ప్లాంట్ ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా శుక్రవారం జీవీఎంసీ గాంధీ విగ్రహం వద్ద చేపట్టిన నిరాహారదీక్షకు సాంప్రదాయ మత్స్యకార సంక్షేమ సంఘం నాయకులు సంఘీభావం తెలిపారు. ఈ సందర్భంగా సంఘం నాయకురాలు లక్ష్మి మాట్లాడుతూ స్టీల్‌ప్లాంట్‌ను ప్రైవేటీకరణ చేయకుండా సెయిల్‌లో విలీనం చేయాలని డిమాండ్ చేశారు.కార్యక్రమంలో ప్రొఫెసర్ సూరప్పడు, ప్రజాగాయకుడు దేవిశ్రీ, మత్స్యకార సంఘం నాయకులు ఎం.లక్ష్మి, జి.లక్ష్మి, కనకరాజు తదితరులు పాల్గొన్నారు.

ఉద్యోగుల తోడ్పాటుతో సంస్థ ప్రగతి

విశాఖ సిటీ: పనిచేసే చోట మానసిక ప్రశాంతతకు తగిన ప్రాధాన్యమివ్వాలని, తద్వారా సంస్థ ప్రగతికి ఉద్యోగులు మరింత తోడ్పాటు అందిస్తారని వీఎంఆర్‌డీఏ కమిషనర్ కె.ఎస్.విశ్వనాథన్ పేర్కొన్నారు. సిరిపురం చిల్డ్రన్స్ ఎరీనాలో శుక్రవారం వీఎంఆర్‌డీఏ ఆవిర్భావ దినోత్సవం ఘనంగా నిర్వహించారు. ఈ వేడుకలను ప్రారంభించిన కమిషనర్ మాట్లాడుతూ ఉద్యోగులకు ఇటువంటి సాంస్కృతిక కార్యక్రమాలు, ఆటల పోటీలు నిర్వహిస్తే రెట్టించిన ఉత్సాహంతో విధులు నిర్వర్తిస్తారన్నారు. ఈ సందర్భంగా ఉద్యోగులకు నిర్వహించిన పోటీల్లో విజేతలకు బహుమతులు అందజేశారు. జాయింట్ కమిషనర్ రమేష్ మాట్లాడుతూ ఉత్తరాంధ్ర అభివృద్ధిలో కీలక భూమిక పోషిస్తూ టీపీటీ నుంచి వుడా తరువాత వీఎంఆర్‌డీఏగా రూపాంతరం చెంది ప్రజల్లో బలమైన ముద్ర వేసుకుందని వివరించారు. కార్యక్రమంలో ముఖ్య ప్రణాళిక అధికారి శిల్పా, ప్రధాన ఇంజినీర్ భవానీశంకర్, పర్యవేక్షక ఇంజినీర్ బలరామరాజు, డీఎఫ్‌వో శాంతిస్వరూప్, ఇతర అధికారులు పాల్గొన్నారు.



చంద్రమౌళేశ్వర ఆలయంలో పూజల్లో పాల్గొన్న భక్తులు



సాయి మందిరంలో అమ్మవారిని దర్శించుకుంటున్న భక్తులు



శ్రీహరిపురం వద్ద జరిగిన పూజల్లో పాల్గొన్న షైనింగ్ స్టార్స్ అసోసియేషన్ ప్రతినిధులు, సభ్యులు

ఓంకార రూపిణి.. వేద స్వరూపిణి

దుర్గాదేవి గాయత్రిదేవిగా దర్శనమిచ్చారు. శరన్నవరాత్రి మహోత్సవాల రెండో రోజు అమ్మవారిని ప్రత్యేకంగా అలంకరించి, భక్తులకు దర్శనాలు కల్పించారు. వేద స్వరూపిణి అయిన అమ్మవారికి ప్రత్యేక పూజలు చేశారు.



గాజువాక ఆర్టీసీ డిపో వద్ద గల మందిరంలో..



కొత్తపాలెం విజయ దుర్గా ఆలయంలో..



సామూహిక కుంకుమార్చనలో పాల్గొన్న మహిళలు

విశాఖ విద్య: దసరా మహోత్సవాలు నియోజకవర్గంలో వైభవంగా జరుగుతున్నాయి. నవరాత్రి ఉత్సవాల్లో రెండో రోజు శుక్రవారం అమ్మవారిని దర్శించుకునేందుకు అధిక సంఖ్యలో భక్తులు తరలి వచ్చారు. ఆలయాలతో పాటు మండపాల్లో కొలువుదీరిన జగన్మాతను దర్శించుకుని మొక్కులు చెల్లించారు. దుర్గమ్మా..చల్లంగ చూడమ్మా అంటూ భక్తులంతా సంకీర్తనలు ఆలపించారు.

➡ 90వ వార్డు బుచ్చిరాజుపాలెం శ్రీ దుర్గాలమ్మ-బంగారమ్మ అమ్మవారికి విశేష పూజలు జరిపించారు. మహిళలు అధిక సంఖ్యలో పాల్గొని అమ్మవారికి సామూహిక కుంకుమ పూజలు



గోపాలపట్నంలోని సినిమా హాలు ప్రాంగణంలో ప్రత్యేక అలంకరణలో అమ్మవారు

చేశారు. సీతారామరాజు నగర్ శ్రీ పార్వతీ చంద్రమౌళీశ్వర స్వామి ఆలయంలో అమ్మవారికి విశేష పూజలు చేశారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ అధ్యక్షులు ఇచ్ఛాపు నాగేంద్ర, కార్యదర్శి ఎం.శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

➡ ఏపీఎస్ఈబీ కాలనీ శ్రీ షిర్డీ సాయి మందిరంలో



దుర్గాలమ్మ-బంగారమ్మ ఆలయంలో అమ్మవారికి సామూహిక కుంకుమ పూజలు

ప్రత్యేక మండపంలో కొలువుదీరిన అమ్మవారి దర్శనం కోసం భక్తులు బారులు తీరారు. అర్చకులు భక్తుల పేరిట పూజలు జరిపించి, అమ్మవారి తీర్థ ప్రసాదాలను అందజేశారు. ఆలయ కమిటీ అధ్యక్షుడు విల్లా సత్యనారాయణ రావు, కోశాధికారి సుబ్బారావు ఆధ్వర్యంలో ఏర్పాట్లు చేశారు.

గోపాలపట్నం: 89వ వార్డు కొత్తపాలెం అయ్యప్ప సహిత విజయదుర్గా దేవి ఆలయంలో అమ్మవారిని గాయత్రి దేవిగా అలంకరించారు. ఉదయం నుంచి అధిక సంఖ్యలో భక్తులు అమ్మవారిని పసుపు కుంకుమలతో విశేషంగా అర్చించారు. గాయత్రి మంత్రాన్ని జపించారు. ఆలయ కమిటీ సభ్యులు అమ్మవారి తీర్థ ప్రసాదాలు వితరణ చేశారు.

➡ కొత్తపాలెం ఖారవేల్ నగర్‌లో దుర్గమ్మను ఎమ్మెల్యే గణబాబు దర్శించుకున్నారు.

➡ 92వ వార్డు శంకర సినిమా హాలు ప్రాంగణంలో ఏర్పాటు చేసిన దుర్గాదేవి మండపం వద్ద భక్తులు ప్రత్యేక పూజలు చేశారు.

గాయత్రి దేవిగా దుర్గమ్మ

మల్కాపురం: గాజువాక ఆర్టీసీ డిపో వద్ద గల విజయదుర్గ అమ్మవారి ఆలయంలో ప్రత్యేక పూజలు జరిగాయి. ఉత్సవాల రెండో రోజు అయిన శుక్రవారం అమ్మవారిని గాయత్రిదేవిగా అలంకరించారు. అమ్మవారికి ప్రీతికరమైన నైవేద్యాలను నివేదించి, సుగంధ పుష్పాలతో అర్చించారు.

➡ 60వ వార్డు శ్రీహరిపురం, జవహర్‌నగర్, రెండు గుడుల సెంటర్ వద్ద స్థానిక షైనింగ్ స్టార్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో దుర్గాదేవి పూజలు చేశారు. జనసేన నాయకురాలు అంగ దుర్గాప్రశాంతి, అసోసియేషన్ ప్రతినిధులు వై.అశోక్, సీహెచ్.బుజ్జి తదితరులు పాల్గొన్నారు.

➡ 61వ వార్డు మల్కాపురం, గొల్లవీధి వద్ద స్థానిక డేరింగ్ అండ్ డాషింగ్ యూత్ ఆధ్వర్యంలో జరిగిన దుర్గాదేవి పూజలలో మహిళలు అధిక సంఖ్యలో పాల్గొని గాయత్రిదేవి రూపంలో ఉన్న దుర్గమ్మవారిని దర్శించుకుని, పూజలు చేశారు.

టెట్ నిర్వహణపై అసంతృప్తి

అరగంట కోల్పోయామని అభ్యర్థుల ఆందోళన



టెట్ పరీక్ష నిర్వహించిన ఎరోవాన డిజిటల్ జోన్



టెట్ పరీక్ష రాసి బయటకు వస్తున్న అభ్యర్థులు

గోపాలపట్నం: టెట్ పరీక్షలు నిర్వహిస్తున్న బుజ్జిరాజుపాలెం ఎరోవాన డిజిటల్ జోన్‌లో శుక్రవారం కంప్యూటర్లు సరిగ్గా పని చేయకపోవడంతో అరగంట సమయం కోల్పోయామని అభ్యర్థులు ఆందోళన వ్యక్తం చేశారు. నిర్వాహకులకు పలు మార్లు ఫిర్యాదు చేసినా పట్టించుకోలేదని ఆవేదన వ్యక్తం చేశారు. సరైన సమయంలో వారు స్పందించి కంప్యూటర్ ఇవ్వకపోవడంతో 2.30 గంటల పరీక్ష సమయంలో అరగంట నష్టపోయామని వాపోయా రు. కేంద్రంలో ఫ్యాన్లు కూడా పని చేయడం లేదని తెలిపారు. ఉన్నతాధికారులు స్పందించి ఈ పరీక్ష కేంద్రంలో సమస్యలు పరిశీలించాలని కోరుతున్నారు.

ఆస్పత్రిలో ప్రైవేట్ వాహనాల పార్కింగ్



ఆస్పత్రి పార్కింగ్ స్థలంలో నిలిపిన ప్రైవేట్ వ్యక్తుల కార్లు

మల్కాపురం: జీవీఎంసీ 60వ వార్డు గుల్లపాలెం వద్ద గల ఎఫ్ఆర్‌యూ (జీవీఎంసీ 30 పడకల ఆస్పత్రి)లో పార్కింగ్ షెడ్‌ను ప్రైవేట్ వ్యక్తులు వినియోగించడం విమర్శలకు తావిస్తోంది. ఆస్పత్రికి వచ్చే వైద్యుల కార్లతో పాటు అంబులెన్స్ పార్క్ చేసేందుకు ఆస్పత్రి ఆవరణలో పార్కింగ్ షెడ్ ఏర్పాటు చేశారు. అయితే ఆస్పత్రికి వైద్య నిపుణులు రాకపోవడంతో పార్కింగ్ స్థలం ఖాళీగా ఉంది.ఇదే అదనుగా భావించిన కొందరు తమ సొంత స్థలం మాదిరిగా ఆస్పత్రి లోపల కార్లు పార్కు చేస్తున్నారు. ఆస్పత్రి వెనుక గదుల్లో జీవీఎంసీ వర్క్స్, ఎలక్ట్రికల్, సచివాలయం ఉన్నా ఆ సిబ్బంది ఎవరూ ప్రశ్నించడం లేదని పలువురు అంటున్నారు.

మౌలిక వసతుల కల్పనకు ప్రాధాన్యం



పనులు పరిశీలిస్తున్న కమిషనర్ సంపత్‌కుమార్, డిప్యూటీ మేయర్ శ్రీధర్ తదితరులు

- జీవీఎంసీ కమిషనర్ సంపత్ కుమార్
- 52వ వార్డులో విస్తృత పర్యటన
- అభివృద్ధి పనుల పరిశీలన

విశాఖ విద్య: కాలనీల్లో మౌలిక వసతులు మెరుగుపరిచేందుకు ప్రాధాన్యం ఇస్తామని జీవీఎంసీ కమిషనర్ సంపత్ కుమార్ అన్నారు. 52వ వార్డు పరిధిలో డిప్యూటీ మేయర్ జియ్యాని శ్రీధర్, జీవీఎంసీ అధికారులతో కలిసి శుక్రవారం విస్తృతంగా పర్యటించారు. అనంతరం సంజీవయ్యనగర్, అపర్ణా అపార్ట్‌మెంట్ సమీపంలోని గ్రీన్‌బెల్ట్‌లో జరుగుతున్న కళావేదిక నిర్మాణ పనులను, శాంతినగర్ పార్క్, ఓల్డ్ కరాస పార్కుల్లో జరుగుతున్న అభివృద్ధి పనులను పరిశీలించారు. అనంతరం కరాస శ్మశాన వాటికలో పనులను పరిశీలించారు. ఈ సందర్భంగా శ్రీధర్ మాట్లాడుతూ వార్డులో ఉన్న కాలనీల్లో రోడ్లు, పార్కులు అభివృద్ధి చేశామని, మిగిలిన పనులు కూడా త్వరితగతిన పూర్తి చేయాలని కమిషనర్‌ను కోరారు. మర్రిపాలెం ఉడా లే అవుట్ లలితా డిలైట్ గ్రీన్ బెల్ట్, మారియట్ హోటల్ ఎదురుగా ఉన్న మహిళా వాకింగ్ ట్రాక్ అభివృద్ధి చేయాలని కమిషనర్ దృష్టికి తీసుకెళ్లారు. ఫ్లై ఓవర్ కింద అంబేడ్కర్ విగ్రహం ఉన్న ఏరియాలో మరిన్ని సౌకర్యాలు కల్పించాల్సిన అవసరం ఉందన్నారు. ఈ సందర్భంగా వార్డు పరిధిలో చేపట్టాల్సిన పనులకు నిధులు కేటాయించాలని కోరుతూ కమిషనర్‌కు శ్రీధర్ వినతిపత్రం అందించారు. కార్యక్రమంలో ఇంజినీరింగ్ విభాగం డీఈ ఏడుకొండలు, ఏఈ ఉషారాణి , హార్టికల్చర్ ఏఈ అర్చన, వర్క్ ఇన్‌స్పెక్టర్ బాలకృష్ణ , పారిశుధ్య విభాగం అధికారి మూర్తి, సచివాలయం ఉద్యోగులు అనూప్, తదితరులు పాల్గొన్నారు.

శిథిలావస్థలో సులభ్ కాంప్లెక్స్



పెచ్చులూడిన సులభ్ కాంప్లెక్స్

మల్కాపురం: జీవీఎంసీ 58వ వార్డు గుల్లలపాలెం శివారు ప్రాంతంలో ప్రజావసరాల కోసం పదేళ్ల క్రితం నిర్మించిన ప్రజా మరుగుదొడ్డి పూర్తిగా శిథిలావస్థకు చేరుకుంది. గుల్లలపాలెంలో అప్పటి పాలకులు సుమారు రూ.2 లక్షలతో సులభ్ కాంప్లెక్స్‌ను నిర్మించారు. అప్పట్లో ప్రజలు దీనిని వినియోగించేవారు. దీనిని నిర్మించి సంవత్సరాలు గడవటం, నిర్వహణను అధికారులు పట్టించుకోకపోవడంతో శ్లాబ్ పెచ్చులు ఊడి, గోడలు బీటలు వారాయి. దీంతో ఇది నిరుపయోగంగా మారింది. ఈ కాంప్లెక్స్‌కు గేట్లు లేకపోవటంతో స్థానికంగా ఉన్న పలువురు చిన్నారులు ఆడుకునేందుకు కాంప్లెక్స్ లోపలికి వెళ్తుంటారు. ఆ సమయంలో శ్లాబ్ పెచ్చులు రాలి పిల్లలపై పడతాయేమోనని వారి తల్లిదండ్రులు ఆందోళన చెందుతున్నారు. శిథిలావస్థలో ఉన్న కాంప్లెక్స్‌ను తొలగించి, ఆ స్థలంలో ప్రజావసరాలకు ఉపయోగపడే నిర్మాణం చేపట్టాలని స్థానికులు కోరుతున్నారు.

గ్రామ స్థాయి నుంచి వ్యాధులపై అవగాహన

ప్రముఖ గ్యాస్ట్రో ఎంట్రాలజిస్టు డాక్టర్ నాగేశ్వరరెడ్డి



ప్రసంగిస్తున్న నాగేశ్వరరెడ్డి

మహారాణిపేట: వ్యాధులపై గ్రామ స్థాయి నుంచి ప్రజలకు అవగాహన కల్పించాల్సిన అవసరం ఉందని ప్రముఖ గ్యాస్ట్రో ఎంట్రాలజిస్టు డాక్టర్ నాగేశ్వరరరెడ్డి అభిప్రాయం వ్యక్తం చేశారు. పేగు సంబంధిత వ్యాధులపై వైజాగ్ గ్యాస్ట్రో ఎంట్రాలజీ క్లబ్ అసోసియేషన్, కోలైటా అండ్ కార్న్ ఫౌండేషన్ ఇండియా సంయుక్తంగా విశాఖ వేదికగా మూడు రోజుల పాటు నిర్వహించనున్న ఎనిమిదో జాతీయ స్థాయి సదస్సు శుక్రవారం మొదలైంది. నగరంలోని ఓ హోటల్‌లో కేజీహెచ్ గ్యాస్ట్రోఎంట్రాలజీ విభాగాధిపతి డాక్టర్ ఎల్ఆర్ఎస్ గిరినాథ్ ఆధ్వర్యంలో జరిగింది. సదస్సుకు దేశ, విదేశాలతో పాటు బ్రిక్స్ నుంచి కూడా పది మంది గ్యాస్ట్రో ఎంట్రాలజీ వైద్య నిపుణులు హాజరై, ఆయా దేశాల్లో అమలవుతున్న నూతన వైద్య పద్ధతులను వివరించారు. ఈ సందర్భంగా డాక్టర్ నాగేశ్వరరెడ్డి మాట్లాడుతూ పేగు తదితర వ్యాధులకు నూతన వైద్యం అందుబాటులోకి వచ్చిందన్నారు.విదేశీ వైద్యులు డాక్టర్ కేడియాచే క్రోన్స్, డాక్టర్ సైమన్ ట్రావిస్(యూఎస్ఏ), డాక్టర్ అజిత్ సూద్ ప్రసంగించారు. కార్యక్రమంలో ఆర్గనైజింగ్ సెక్రటరీ డాక్టర్ చలపతిరావు, ఏఎంసీ మాజీ హెచ్‌వోడీ డాక్టర్ పెదవీర్రాజు,డాక్టర్ శివప్రసాద్,డాక్టర్ విశ్వనాథ్, కేజీహెచ్ అసిస్టెంట్ ప్రొఫెసర్ డాక్టర్ వంశీ పాల్గొన్నారు.

ఆత్మీయ వేడుక.. ఆనంద గీతిక..



ప్రతిభా పురస్కారాలు అందిస్తున్న కైరళి ఆర్ట్స్ క్లబ్ ప్రతినిధులు



ఓనం వేడుకలో మహాబలి పాత్రధారణ

- ఓనంతో సందడి చేస్తున్న మలయాళీలు
- వేదికగా నిలుస్తున్న కైరలీ క్లబ్

గాజువాక: సంస్కృతి, సాంప్రదాయాలకు పెద్దపీట వేసే మళయాళీలు ఓనం పండగతో సందడి చేస్తున్నారు. పారిశ్రామిక రాజధానిగా వెలుగొందిన గాజువాక ప్రాంతంలో స్థిరపడిన వారంతా ఒకచోట చేరి ఆనందంగా గడుపుతున్నారు. వీరిని కైరళీ ఆర్ట్స్ క్లబ్ ఐక్యంగా ముందుకు నడుపుతోంది.

18 వేల కుటుంబాలు.. 70 వేల జనాభా : ప్రస్తుతం విశాఖ జిల్లాలో 18 వేల మలయాళీ కుటుంబాలు ఉన్నాయి. దాదాపు 70 వేల నివసిస్తున్నట్టు అంచనా. కేరళలోని వివిధ ప్రాంతాల నుంచి విశాఖ వచ్చి ఉద్యోగులుగా, వ్యాపారులుగా స్థిరపడిన కుటుంబాలు ఎక్కువగా ఉన్నాయి. విశాఖలో కాల్‌ట్యాక్స్, షిప్‌యార్డు నిర్మాణ సమయంలో కేరళీయులు ఇక్కడికి రావడం మొదలుపెట్టారు. ఆ సంఖ్య విశాఖ స్టీల్‌ప్లాంట్ నిర్మాణం ప్రారంభమైన తర్వాత మరింత పెరిగింది. దీంతో మలయాళీల సంస్కృతి, సాంప్రదాయాలు విశాఖ వాసులకు సైతం పరిచయమయ్యాయి.

ఒకే గొడుగు కింద మలయాళీలు : కేరళలోని వివిధ ప్రాంతాలనుంచి ఇక్కడికి వచ్చిన మలయాళీలను కైరళీ ఆర్ట్స్ క్లబ్ ఐక్యంగా ముందుకు నడుపుతోంది. వారిని ఐక్యం చేయడానికి, ఆచార సాంప్రదాయాలను కాపాడుకోవడానికి కై రళీ ఆర్ట్స్ క్లబ్ పని చేస్తోంది. 1980లో ప్రారంభమైన ఈ సంస్థ మలయాళీల సంక్షేమానికి అనేక కార్యక్రమాలు నిర్వహిస్తోంది. వైద్య శిబిరాలు, రక్తదాన శిబిరాలు, సంక్షేమ కార్యక్రమాలతో పాటు పేద మలయాళీ కుటుంబాలకు, ప్రతిభ ప్రదర్శించే విద్యార్థులకు ఆర్థిక సహాయం చేయడం వంటి కార్యక్రమాలను నిత్యం ఏర్పాటు చేస్తోంది. మినీ ఇండియాగా పిలుచుకొనే గాజువాక ప్రాంతంలో కేరళ సాంప్రదాయం ప్రత్యేకమనే చెప్పవచ్చు.

అంతా సందడి : మలయాళీల సంస్కృతికి అద్దంపట్టే అనేక పండగలు ఇక్కడివారిని విశేషంగా ఆకట్టుకుంటాయి. వారి ఆచారాలు, అలవాట్లు చూస్తే ముచ్చటేస్తునడంలో అతిశయోక్తిలేదు. తెలుగువారికి ప్రతిష్టాత్మకమైన పండగ సంక్రాంతి ఎలాగో, మలయాళీలకు ఓనం వేడుక అంత ప్రధానమైనది. ఏటా ఆగస్టు, సెప్టెంబర్ మధ్య ఈ వేడుకను మలయాళ కుటుంబాలు అత్యంత సందడిగా నిర్వహిస్తారు. అన్ని ప్రాంతాలకు చెందిన మలయాళీలు ఒకే వేదికపైకి వచ్చి వినూత్నమైన ముగ్గులు, సాంస్కృతిక కార్యక్రమాలతో ఓనం రోజు ఆనందంగా గడుపుతారు. జిల్లాలో పలువురు ప్రముఖులను ఆహ్వానించి తమ సంతోషాన్ని పంచుకుంటారు. పండగకు సుమారు 16 రకాల వంటకాలు తయారు చేసి మూడువేల మందికి తగ్గకుండా వడ్డిస్తారు. కేరళీయులు జరుపుకొనే ఉత్సవాల్లో విషు ఉత్సవం మరొక విశేషం. తెలుగు వారికి ఉగాది ఎలాగో, వారికి విషు అలాంటింది. తెల్లవారుజాము నాలుగు గంటల నుంచి ఈ ఉత్సవాన్ని ఎంతో వైభవంగా నిర్వహిస్తారు. ఈ సందర్భంగా కథాకళి వంటి నృత్య రూపకాలను కనుల పండువగా నిర్వహిస్తారు. కూరగాయలతో ప్రసాదం తయారు చేసి అందరికీ రుచి చూపిస్తారు. ఇంకా క్రిస్మస్, న్యూ ఇయర్ వంటి పండుగులు కూడా ఎంతో వేడుకగా నిర్వహిస్తారు.